క్లుప్తంగా

రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో నివాసితులకు అవసరమైన రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు సర్పంచ్ కోట బేబీరాణి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు అన్నారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సహకారంతో అమలాపురం ఎంపీ చింతా అనురాధ నిధులతో చిరతపూడి శివారు రంగా వీధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజను బుధవారం చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో అన్ని రహదారులను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బొంతు శ్రీనివాస్, బొడ్డు అప్పాజీ, డి.శ్రీనివాస్, ఎల్.శ్రీనివాస్, బీర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు

అంబాజీపేట: స్థానిక వీరభద్ర థియేటర్ సమీపాన వేంచేసిన విజయ కనకదుర్గ అమ్మవారి 28వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అర్చకులు మాచరి వెంకట్రాజు ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, గణపతి పూజలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

రేపు మండల బడ్జెట్ సమావేశం

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య బడ్జెట్ సమావేశం ఈ నెల 26న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధుల విధిగా హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

ఉపాధి పనుల పరిశీలన

పి.గన్నవరం: దేశాభివృద్ధే ధ్యేయంగా ప్రధాని మోదీ పని చేస్తున్నారని బీజేపీ నాయకులు అన్నారు. మండలంలోని కె.ముంజవరంలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను బుధవారం వారు పరిశీలించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ చెరుకూరి గోపాలకృష్ణ, నాయకులు ఎంవీ ప్రసాద్, పాటి సత్యనారాయణ, ఎంవీ నారాయణ, కె.శ్రీను, జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీపై కేసు

అయినవిల్లి: బైక్ చోరీపై బుధవారం అయినవిల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపిన వివరాలిలా.. అంబాజీపేటకు చెందిన చెరుకూరి నాగేశ్వరరావుకు చెందిన బైక్‌ను అయినవిల్లిలోని ఏటిగట్టుపై ఉంచి పొలం వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి తన బైక్ లేదు. దీంతో తన బైక్ చోరీకి గురైందని భావించి అయినవిల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తిపై దాడి కేసులో నలుగురికి జైలు

పి.గన్నవరం: జి.పెదపూడిలో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన నేరం రుజువు కావడంతో నలుగురు నిందితులకు ఆరు నెలల వంతున జైలు శిక్ష, రూ.1000 వంతున జరిమానా విధిస్తూ బుధవారం కొత్తపేట జేఎఫ్‌సీఎం ఎం.భాస్కరరావు తీర్పునిచ్చారు. దీనికి సంబంధించి పి.గన్నవరం ఎస్సై హరికోటిశాస్త్రి తెలిపిన వివరాల ప్రకారం.. 2014 డిసెంబర్ 1న జి.పెదపూడిలో అడ్డగళ్ల వెంకటేశ్వరరావు చేను దగ్గర వివాదం జరిగింది. దీంతో వెంకటేశ్వరరావుపై పోలిశెట్టి చినసత్యనారాయణ, కొండబాబు, రాంబాబు, అడ్డగళ్ల అన్నవరంలు దాడి చేసి కత్తితో చేతిపై గాయపరిచారు. బాధితుడు వెంకటేశ్వరరావు ఫిర్యాదుపై అప్పటి ఎస్సై జి.హరీష్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో నిందితులు నలుగురికి మెజిస్ట్రేటు జైలు శిక్ష విధించారు. బాధితుడి తరఫున పీపీ ఎస్.ఆనంద్ కేసు వాదించారని ఎస్సై హరికోటిశాస్త్రి వివరించారు.

ప్రభుత్వ కళాశాలకు ఉపాధ్యాయులు సిద్ధం

ఉప్పలగుప్తం: జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న ఇంటర్ విద్య బోధించేందుకు అన్ని సబ్జెక్టుల జూనియర్ అధ్యాపకులు విధులకు వచ్చారని ప్రధానోపాధ్యాయురాలు లంకా రాణి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్ చదువు కోసం బాలికలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ప్రభుత్వం అన్ని సౌకర్యాలు ఏర్పరచిందన్నారు. దీన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించి స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చేరే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీచర్ పోస్టుల ఖాళీలను భర్తీ చేయాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ఎంపీ వైద్యలింగం ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలల్లో టీచర్ పోస్టులను దశలవారీగా భర్తీ చేయాలన్నారు. టీచర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో వాటి ప్రభావం విద్యార్థుల పాస్ పర్సంటేజీపై పడుతుందన్నారు.

సంక్షోభంలో డొక్కతాడు పరిశ్రమ

- గణనీయంగా తగ్గిన ధరలు
- మహిళల ఉపాధికి ఆటంకం



బి.దొడ్డవరంలో మెషీన్ల ద్వారా తయారు చేసిన డొక్కతాడు

మామిడికుదురు: కుటీర పరిశ్రమగా విస్తరించిన డొక్క తాడు పరిశ్రమ ప్రస్తుతం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. గత ఆరు నెలల నుంచి ధరలు లేక ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. దీంతో ఈ పరిశ్రమపై ఆధారపడిన మహిళల ఉపాధికి ఆటంకం ఏర్పడింది. కోనసీమలో సుమారుగా మూడు వేలకు పైగా డొక్కతాడు యూనిట్లు పని చేస్తున్నాయి. వీటి ఆధారంగా సుమారు మూడు వేల మంది మహిళలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. కొబ్బరి పీచు పరిశ్రమల నుంచి నేరుగా డొక్క పీచును తీసుకువెళ్లి మెషీన్ల సహాయంతో రెండు పేటలు, మూడు పేటల తాడుతో పాటు పగ్గాలను మహిళలు తయారు చేస్తున్నారు. ఇక్కడ తయారవుతున్న తాడు హైదరాబాద్, ముంబై నగరాలతో పాటు ఇతర దేశాలకు సైతం ఎగుమతి అయ్యేది. ప్రతి నిత్యం కోనసీమ నుంచి గతంలో 10 లారీలు సరుకు ఎగుమతి చేసేవారు. రోజుకు 60 టన్నులు డొక్కతాడు ఎగుమతి అయ్యేదని నిర్వాహకులు చెబుతున్నారు. ప్రస్తుతం వారానికి కూడా అంత ఎగుమతి కావడం లేదని పేర్కొంటున్నారు.

దిగజారిన ధరలు...

ఆరు నెలల నుంచి డొక్కతాడు ధరలు దారుణంగా పడిపోయాయి. గతంలో నాలుగు కిలోల తాడు కట్ట రూ.220 ఉండేది. ప్రస్తుతం దాని ధర రూ.140 నుంచి రూ.145కు పడిపోయింది. డిమాండ్‌ను బట్టి ఈ ధర కాస్త అటూ ఇటూగా మారుతుంది. గత ఏడాది కన్నా పరిశ్రమల నిర్వహణ ఖర్చులు పెరిగాయని చెబుతున్నారు. కూలీల రేట్లతో పాటు విద్యుత్ చార్జీల ధరలు పెరగడం డొక్కతాడు పరిశ్రమలకు శాపంగా మారాయని మహిళలు వాపోతున్నారు. రియల్ ఎస్టేట్ రంగం ఆటుపోట్లకు గురికావడంతో పాటు ఇతర దేశాలకు ఎగుమతులు నిలిచిపోవడమే ధరల పతనానికి కారణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దారుణంగా పడిపోయిన ధర



డొక్కతాడు ధరలు దారుణంగా పడిపోవడంతో ఎగుమతులు నిలిచిపోయాయి. కరోనా సమయంలో కూడా ఇటువంటి పరిస్థితి ఏర్పడలేదు. గత ఏడాది వేసవిలో వారానికి నాలుగు నుంచి అయిదు లారీల డొక్కతాడు హైదరాబాద్‌కు ఎగుమతి అయ్యేది. కానీ ప్రస్తుతం వారానికి ఒక లారీ కూడా ఎగుమతి కావడం లేదు. డొక్కతాడుకు డిమాండ్ లేకపోవడమే దీనికి కారణం. డొక్కతాడు ధర పెరుగుతుందని ఆశగా ఎదురు చూస్తున్నాం.
– కుంపట్ల లక్ష్మి, బి.దొడ్డవరం

ఉపాధి దెబ్బతింది



క్వాయర్ పరిశ్రమల ద్వారా ఎంతో మంది మహిళలు ఉపాధి పొందుతున్నాం. కరోనా సమయంలో తాడు పరిశ్రమే మమ్మల్ని ఆదుకుంది. మెషీన్ల ద్వారా తయారైన తాడు ముక్కలుగా కట్ చేసి పిడులు తయారు చేయడం ద్వారా మాకు ఆదాయం వస్తుంది. గతంలో కట్టకు రూ.11 ఇచ్చేవారు. ప్రస్తుతం కట్టకు రూ.10 మాత్రమే ఇస్తున్నారు. ఈ పని కూడా నామమాత్రంగానే ఉంటుంది. డిమాండ్ లేక పోవడంతో మా ఉపాధి దెబ్బతింది.
– కె.లక్ష్మీనూకరత్నం, బి.దొడ్డవరం

ఎన్నడూ ఈ పరిస్థితి లేదు



20 ఏళ్ల నుంచి చాలా మంది మహిళలు డొక్కతాడును కట్టలుగా కడుతూ ఆదాయం పొందుతున్నారు. మాకు ఎప్పుడూ తీరిక లేకుండా పని ఉండేది. కానీ ప్రస్తుతం ధర లేకపోవడంతో పని లేకుండా పోయింది. డొక్కతాడుకు డిమాండ్ లేక పోవడమే దీనికి ప్రధాన కారణం. డొక్కతాడుకు పూర్వ వైభవం రావాలని ఆశగా ఎదురు చూస్తున్నాం. మా ఆశలు ఎప్పటికి ఫలిస్తాయో! వేచి చూడక తప్పదు.
– కుంపట్ల గంగాభవాని, బి.దొడ్డవరం

నేడు అలమూరులో గడప గడపకూ..

అలమూరు: గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో నాలుగో విడత నిర్వహించే ఈ కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు స్థానిక సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అధిక సంఖ్యలో తరలి రావాలని వారు పిలుపు నిచ్చారు. అలాగే గ్రామ సచివాలయం వద్ద గ్రామ వలంటీర్లకు సన్మానం జరుగుతుందన్నారు.

బాటసారులకు ఎంతో ఉపశమనం

అంబాజీపేట: చలివేంద్రాల ఏర్పాటుతో వేసవిలో రోడ్డుపై ప్రయాణించే బాటసారులకు, వాహనదారులకు ఎంతో ఉపశమనం లభిస్తుందని సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్ అన్నారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీ వినాయక యాడ్స్ అధినేత బొక్కా వినాయకరావు ఆధ్వర్యంలో అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ ఎదురుగా గత వారం రోజులుగా చలివేంద్రం నిర్వహిస్తున్నారు. వారు మాట్లాడుతూ ప్రధాన రహదారిపై ప్రయాణిస్తున్న ప్రయాణికుల దప్పిక తీర్చేందుకు డ్రింక్ చలివేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

ప్రజల ఆదరణే శ్రీరామరక్ష

ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు



నగరంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: ప్రజల ఆదరణే వైఎస్సార్ సీపీకి శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయ కేతనం ఎగరేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం రాత్రి ఎమ్మెల్యే నివాసం వద్ద పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన కేక్‌ను చిట్టిబాబు కోసి పార్టీ శ్రేణులకు తినిపించారు. పార్టీ శ్రేణులు జై జగన్, జైజై జగన్ నినాదాలతో హోరెత్తించారు. దీనిలో భాగంగా ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ వెన్నంటి నిలిచిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. 2024 ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని జోస్యం చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుకుంటున్న ప్రజలు ప్రభుత్వానికి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. పార్టీకి అగడగుడునా నీరాజనాలు పలుకుతున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆదరాభిమానాలే సీఎం జగన్ మోహన్‌రెడ్డికి తోడుగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో అప్పనపల్లి దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, పార్టీ నేతలు నెల్లి దుర్గాప్రసాద్, యూవీవీ సత్యనారాయణ, కొండేటి వెంకటేశ్వరరావు, గెద్దం వెంకటేశ్వరరావు, చిక్కం బుజ్జిబాబు, కేదారిశెట్టి మల్లి, దొమ్మేటి దుర్గారావు, పాలమూరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు జగనన్న కల్పించిన సేవాభాగ్యం



వానపల్లిలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు రమాదేవి

కొత్తపేట: ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తరఫున గ్రామ వలంటీర్లకు కలిగించారని ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి అన్నారు. 'వలంటీర్లకు వందనం' సేవా పురస్కారాలు ప్రదానంలో భాగంగా మండలంలోని వానపల్లి, బిళ్లకుర్రు గ్రామాల పరిధిలో వలంటీర్లకు సత్కారం కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వానపల్లి పంచాయతీ పరిధిలోని 3 సచివాలయాల వలంటీర్ల సన్మానం పీఏసీఎస్ ప్రాంగణంలో ఆ గ్రామ కార్యదర్శి వీవీ రామన్ అధ్యక్షతన, బిళ్లకుర్రు పరిధిలో వలంటీర్ల సన్మానం ఆ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు అధ్యక్షతన జరిగిన సభల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ రమాదేవి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్ అవినీతి రహిత పాలన అందించేందుకు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఈ వలంటీర్ వ్యవస్థ తీసుకువచ్చారన్నారు. ప్రతి నెలా ఒకటిన తెలవారకముందే పింఛన్ లబ్ధిదారుల తలుపుతట్టి పింఛన్లు పంపిణీ చేయడం దేశంలోనే కాదు ప్రపంచంలోనే కనీ వినీ ఎరుగని ప్రక్రియ అని అన్నారు. మన ప్రభుత్వాన్ని అత్యధిక మెజార్టీతో మళ్లీ అధికారంలోకి తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వలంటీర్లను ఉత్తమ సేవా పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమాల్లో డీసీసీబీ పర్సన్ బండారు రాజా, మండల సేవాదళ్ కన్వీనర్ జి.ప్రవీణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సాకా జానకిరామరాజు, ఆయా గ్రామాల పార్టీ శాఖల అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాసరావు, కాకర సర్వేశ్వరరావు, ఇసుకపట్ల సునీల్ కుమార్, ముత్యాల వెంకటేశ్వరరావు, బిళ్లకుర్రు గ్రామ కార్యదర్శి మంగిపూడి రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాంబాబు సేవలు అభినందనీయం



మలికిపురంలో రాంబాబురాజును సత్కరిస్తున్న బుజ్జిరాజు

మలికిపురం: కరోనా కష్టకాలం నుంచి నేటి వరకూ రోగులకు వైద్య సాయం కోసం స్వచ్ఛందంగా నిరంతరాయంగా అంబులెన్స్ సేవలు అందిస్తున్న దెందుకూరి రాంబాబురాజు అభినందనీయుడని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాజోలు, పి.గన్నవరం ఏరియాల సమన్వయకర్త జంపన బుజ్జిరాజు అన్నారు. బుధవారం మలికిపురంలో తన తండ్రి సత్యనారాయణ రాజు పేరున సొంత ఖర్చులతో అంబులెన్స్ సమకూర్చి, నేటికి రెండేళ్లయిన సందర్భంగా రాంబాబురాజును సత్కరించారు. కరోనా సమయంలో వైద్య సాయం కోసం వాహనాలు దొరకని పరిస్థితుల్లో రాంబాబురాజు ఇందుకు చొరవ చూపడం ప్రశంసనీయమని బుజ్జిరాజు అన్నారు. త్వరలో రెడ్‌క్రాస్ పేట్రన్ మెంబర్‌గా చేరి, తన వంతు సేవలను అందజేస్తానని రాంబాబు రాజు చెప్పారు. మాజీ మండల ఉపాధ్యక్షుడు గెద్దం తులసీ భాస్కరరావు, స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకర్, రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు బోణం రాజు, అల్లూరి మధురాజు, జీవితకాల మెంబర్స్ పల్లపోతు బంగారం, జైదీప్, అటారం మాష్టారు, నల్లి శివకుమార్, బోణం సాయి, వాకా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



సీఎం జగన్‌తో కరచాలనం చేస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పి.గన్నవరం ఎమ్మెల్యే చిట్టిబాబు



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అయినవిల్లి జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పీ చైర్మన్ విప్పర్తి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం జగనన్న విద్యాదీవెన కార్యక్రమం ప్రారంభానికి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు వివిధ వర్గాల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించారు.

గజమాల యాత్రను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మండల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం వ్యవస్థాపకుడు మొల్లేటి రామస్వామి, ఆదిలక్ష్మి దంపతులకు, స్వామి, అమ్మవార్లకు అలంకరించే గజమాల యాత్ర ఈ నెల 31న జరుగుతుందని ఆ యాత్రను విజయవంతం చేయాలని మండల శెట్టిబలిజ సంక్షేమ సంఘం సమావేశం పేర్కొంది. స్థానిక బీసీ సామాజిక భవనంలో బుధవారం సంఘం మండల శాఖ అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం జరిగింది. స్వామి వారి కల్యాణోత్సవాల సందర్భంగా అయిదేళ్ల నుంచి గజమాల యాత్ర నిర్వహిస్తున్నామని తాలూకా సంఘం కన్వీనర్ గుబ్బల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు తాటిపాకలోని తాలూకా సంఘం భవనం నుంచి ప్రారంభమయ్యే గజమాల యాత్రకు భారీగా సంఘం ప్రతినిధులు తరలిరావాలన్నారు. సమావేశంలో వాసంశెట్టి శంకరరావు, పెచ్చెట్టి సత్యచంద్ర, కడలి నూకరాజు, జోగి రామకృష్ణ పాల్గొన్నారు.

వాడపల్లి వేంకటేశ్వరుని ఆదాయం రూ.54.79 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి హుండీల ద్వారా రూ54,79,670 ఆదాయం సమకూరింది. గడయిర 29 రోజులకు హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ప్రధాన హుండీల నుంచి రూ.40,49,004, అన్నప్రసాదం హుండీల నుంచి రూ.14,30,666 చొప్పున ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. బంగారం 12 గ్రాములు, వెండి 345 గ్రాములతో పాటు విదేశీ కరెన్సీ వచ్చిందన్నారు. క్షేత్ర పాలకుడు శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలోని హుండీలను కూడా 29 రోజులకు లెక్కించగా రూ.1,33,023 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, మందపల్లి మందేశ్వర స్వామి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సింగం రాధ, పలివెల ఉమా కొప్పేశ్వర స్వామి ఆలయ ఈఓ ఎస్‌వీఎస్ఎస్‌వీ ప్రసాదరాజు, పొడగట్లపల్లి ఉప్పలపాటి జానకీయమ్మ అన్నదాన సత్రం ఈఓ మీసాల రాధాకృష్ణల పర్యవేక్షణలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు.

ఎస్పీ రఘునాయగంకు సీడీసీ బాధ్యతల కొనసాగింపు

యానాం: ఎస్పీ స్థాయి బాధ్యతలు తీసుకున్న యానాం ఎస్పీ రఘునాయగంకు కరెంట్ డ్యూటీ చార్జెస్(సీడీసీ) కొనసాగిస్తూ బుధవారం పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌వర్మ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకూ ఎస్పీ స్థాయి విధులు నిర్వహస్తున్న రఘునాయగానికి పే అండ్ అలెవెన్సెస్ సైతం ఎల్జీ జారీ చేసిన ఆదేశాల ప్రకారం ఉంటాయని ఆదేశాల్లో పేర్కొన్నారు. అదేవిధంగా బాలచంద్రన్‌కు సిగ్మా సెక్యూరిటీ, శర్వణన్‌కు హోమ్ గార్డ్స్, భక్తవత్సలంకు నార్త్ సబ్ డివిజన్, యు.రాజశేఖరన్‌కు కమాండెంట్ పీఏపీల్లో కరెంట్ డ్యూటీ చార్జెస్‌ను కొనసాగిస్తూ ఆదేశాలిచ్చారు.

ఉచిత శిక్షణ శిబిరానికి రూ.12 వేల విరాళం



శిక్షణ శిబిరంలో క్రీడాకారులతో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల క్రీడా స్థలంలో జరుగుతున్న వేసవి ఉచిత బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న 150 మంది విద్యార్థులకు పౌష్టికాహారం నిమిత్తం అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ రూ.12 వేల నగదును బుధవారం విరాళంగా అందించింది. ఈ శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పర్యవేక్షిస్తున్నారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు సమక్షంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, కార్యదర్శులు కల్వకొలను తాతాజీ, యెండూరి నాగేశ్వరరావు బుధవారం రూ.12 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో శిబిరం కోచ్ ఆకుల ఉమ, బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కుడుపూడి సుబ్రహ్మణ్యం, అసోసియేషన్ ప్రతినిధులు సంసాని బులినాని, కుడుపూడి త్రినాథ్, చప్పిడి శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు 12 సెంట్ల భూమి కేటాయింపు

అల్లవరం: గోడిలంక పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్ నగర్ ప్రజలకు శ్మశాన వాటిక నిర్మాణానికి గ్రామానికి చెందిన నడింపల్లి రమేష్‌రాజు 0.12 సెంట్ల భూమిని ఇచ్చేందుకు అంగీకరించారు. అంబేడ్కర్ నగర్‌కు శ్మశాన వాటిక ఏర్పాటుచేయాలని ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రమేష్‌రాజు స్థలమిచ్చేందుకు ముందుకు రావడంతో చిరకాల కోరిక ఫలించిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దాత రమేష్‌రాజుని గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ రుద్రరాజు లక్ష్మీపతిరాజు, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, రుద్రరాజు దత్తుడురాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

అమలాపురం టౌన్: పట్టణంలో ఓ సెల్ షాపు యాజమాని చనిపోతే పట్టణంలోని మిగిలిన సెల్ షాపుల వ్యాపారులు ఆ కుటుంబానికి రూ.40 వేల ఆర్థిక సాయం అందించి తమ సంఘీభావాన్ని చాటారు. పట్టణంలోని మెయిన్ రోడ్డులో కేబీ సెల్ కేర్ షాపు యాజమాని జానీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. పట్టణ సెల్ షాపు అసోసియేషన్ తరఫున అధ్యక్షుడు ర్యాలి రాజేష్ ఆధ్వర్యంలో రూ.40 వేలు సేకరించి జానీ కుటుంబానికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కేజీఎస్ షబ్బీర్, ఎస్ఆర్టీ రాజేష్, సత్య, రహీమ్, తులసి, బాలాజీ పాల్గొన్నారు.